క్లుప్తంగా

కల్యాణం..కమనీయం



మంగళగిరి: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. నవులూరు గోలివారితోట, కాజ అగస్త్యేశ్వర స్వామి ఆలయం, యర్రబాలెం శివాలయం పాత మంగళగిరి కనకదుర్గ ఆలయాల్లో కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యి.. తిలకించారు. స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయాల వద్ద కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్మికులకు న్యాయం చేయండి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ గురువారం సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే సిమెంట్ ఫ్యాక్టరీ భూములు ఉన్నా కార్మికులకు బకాయిలు మాత్రం యాజమాన్యం చెల్లించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా మంత్రి నారాలోకేష్ ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. యహోషువా, మాణిక్యరావు, బాష, అగ్గయ్య, దానయ్య, శివకుమారి, సారమ్మ, రిబ్కా పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులపై అధికారుల స్పందన

సాక్షి ఎఫెక్ట్


మంగళగిరి: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన విద్యార్థులా.. లేక కూలీలా శీర్షిక కథనానికి అధికారులు స్పందించారు. విద్యాశాఖ మంత్రి నారా నియోజకవర్గంలో విద్యార్థులతో పనులు చేయించడంపై జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, తెనాలి ఉప విద్యాశాఖాధికారి గురువారం ప్రధానోపాధ్యాయులు ద్వారా నివేదిక తెప్పించుకున్నారు. నివేదిక ప్రకారం పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గదుల్లో కుర్చీలు సిబ్బంది ద్వారా సర్దించడం జరిగిందని, వారికి సహాయంగా కొందరు విద్యార్థులు కుర్చీలు, బెంచీలు పట్టడం జరిగిందన్నారు.

మహా శివరాత్రి భారీ అన్నదానం



తాడేపల్లిరూరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తాడేపల్లి సీతానగరం సోమేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు విచ్చేసి, ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని, మహా శివరాత్రి సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్న అంబటి తిరుపతిరావు, అంబటి వెంకటేశ్వరరావు, అంబటి రఘురాముడును అభినందించారు. నిర్వాహకులు అంబటి తిరుపతిరావు, వెంకటేశ్వరరావు, రఘు రాముడు మాట్లాడుతూ గత 15 ఏళ్ల నుంచి మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా స్వామివారి కల్యాణం, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు వెయ్యి మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారని పేర్కొన్నారు. మునగపాటి మారుతీరావు, నాయకులు సామల నాగేశ్వరరావు, బడే కోమలి, శివనాగేంద్రం, సిద్దే రఘుబాబు, మల్లి, టంకసాల ఈశ్వర్ నాయుడు, వల్లూరు శివ పాల్గొన్నారు.

నంది వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా స్వామి కల్యాణ మహోత్సవం అనంతరం గురువారం ఉదయం స్వామివారు నందివాహనంపై భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ జేవీ నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు. గంగా భ్రమరాంబ సమేతుడైన మల్లేశ్వరుడు పురవీధుల్లో విహరించారు.

సమాచారం.. ఏదీ చైతన్యం

- వార్డు, గ్రామ సచివాలయాల్లో కనిపించని సమాచార హక్కు బోర్డులు
- అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం



పట్టణంలో వార్డు సచివాలయ కార్యకలపాలు సాగుతున్న భవనం

మంగళగిరి: నియోజకవర్గంలో సమాచారం చట్టంపై చాలా మందికి ఇంకా అవగాహన లేదు. కొంతమందికి అసలు ఈ చట్టం గురించి తెలియదు. దీనిపై అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులకే పరిమితం కాగా, వార్డు, గ్రామ సచివాలయాల్లో బోర్డులకు కూడా దిక్కులేదు. ఇన్నేళ్లలో ఈ చట్టాన్ని వినియోగించుకున్న వారు 500 మంది కూడా లేకపోవడం విశేషం. వివిధ శాఖలకు సంబంధించిన సమాచార ఈ చట్టం ద్వారా కోరిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. కార్యాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన బోర్డుల్లో పౌర సమాచార అధికారి, సహాయ అధికారి పేర్లు సైతం నమోదు చేయడం లేదు. ఈ పేర్లు రాయడంలో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంక్షేమ పథకాల పనితీరు గురించి తెలుసుకోవాలనే వారికి ఏ అధికారిని సంప్రదించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని కోరే దరఖాస్తు ఫాంలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఈ చట్టంపై అవగాహన కల్పిస్తే అధికారులకే పని ఎక్కువ అవుతుందని భావించి, వారూ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. నియోజకవర్గంలో ఎక్కువ మంది పథకాల వివరాల కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత కాలంలో అధికారులు పూర్తి వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. దీని వల్ల తమకే ఎక్కువ ఇబ్బందులు వస్తాయని అంతగా చైతన్యం తీసుకురావడం లేదన్న భావన వ్యక్తమవుతోంది. పైగా అధికారులు చేసిన తప్పులు కూడా ఇందులో బయటపడతాయి. దరఖాస్తుదారులకు జవాబుదారీగా వ్యవహరించాల్సి ఉంటుందన్న భయంతో ఈ చట్టాన్ని ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి

సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలి. చట్టంపై ప్రజలకు చైతన్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులదే. ప్రజలకు అవగాహన వుంటే ప్రభుత్వ పథకాలలో అవకతవకలు జరగడానికి అవకాశం ఉండదు. ఈ కార్యాలయాలలో చట్టానికి సంబంధించి సమాచారం అందించే అధికారుల పేర్లను బోర్డులలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– అమన్ ఎస్కే, సమాచారం హక్కు చట్టం కార్యకర్త

అవగాహన కల్పించేందుకు చర్యలు



సమాచార హక్కు చట్టంపై ప్రజలలో అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం కోరితే దానికి నిబంధనల ప్రకారం సకాలంలో కోరిన వివరాలను అందించేందుకు కృషి చేస్తాం. సమాచార హక్కు చట్టాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలి.

– అలీంబాషా, కమిషనర్ ఎంటీఎంసీ

సూపర్ సిక్స్‌ను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం

- పోసాని మురళీకృష్ణ అరెస్ట్ అక్రమం
- వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



తాడేపల్లిరూరల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వంలోని పార్టీలన్నీ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చాయని, సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత విస్మరించాయని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హామీలను మరచి, ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులను కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసి, భయభ్రాంతులకు గురిచేస్తోందని మండిపడ్డారు. విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు 40 ఏళ్ల అనుభవం ఉందని పదేపదే మాట్లాడారని, ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం వాటిని తుంగలో తొక్కారన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులకు టార్గెట్ చేసి రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది నెలల కాలంలో వేలాది మందిపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దానిలో భాగంగా సినీ నటుడు పోసాని కృష్ణమురళీపై అక్రమ కేసు బనాయించి, హైదరాబాద్ నుంచి రాత్రికి రాత్రి రాయలసీమ తరలించారన్నారు. పోసాని రచయిత, అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి అని, అతను ఎక్కడా కూటమి ప్రభుత్వాన్ని దూషించలేదన్నారు. ప్రభుత్వం చేస్తున్న పరిపాలనపై మాట్లాడారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ఆయా ప్రాంతాల్లో అధికారులు నడుచుకుంటున్నారని, ఏది మంచి ఏది చెడు అని కూడా ఆలోచించకుండా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు 30 వేల మంది ఆడపడుచులు కనిపించడం లేదంటూ పదేపదే ఆరోపణలు చేశారని, ఆ 30 వేల మందిలో ఎంతమందిని తీసుకువచ్చారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం వారిపై ఉందన్నారు. గుడ్లవల్లేరు కాలేజీ వంటి ఘటనలు అనేక చోట్ల జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వ తీరును పరిశీలిస్తున్నారని, ఏదో రోజు ప్రజలు ప్రభుత్వంపై తిరగబడతారని ఆయన అన్నారు.

నేడు భారీ అన్న సంతర్పణ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి పోలకంపాడులో వేంచేసి యున్న పోలకమ్మతల్లి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు వంగ దేవ గురువారం తెలిపారు. పోలకంపాడులోని పోలకమ్మ తల్లిదేవాలయ 17వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి 11 గంటల వరకు అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంత ప్రభాకర్, తోక సత్యనారాయణ, గంగాధర్, కొండలరావు, బత్తుల నాగబాబు, బత్తుల ప్రభుదాసు, వంగ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు



ఫిరంగిపురం: ఓటు వేసేందుకు క్యూలో నిలిచిన ఓటర్లు

దుగ్గిరాల: ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు దుగ్గిరాలలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని మూడు పోలింగ్ బూత్‌లను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించి పోలింగ్ అధికారులకు పలుసూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య పోలింగ్ కేంద్రం బయట డాక్టర్ కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు తెలిపారు..దుగ్గిరాల మండలంలో 2,254 ఓట్లకు గాను 1676 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. అంటే 74.3 శాతం పోలైనట్లు అధికారులు ప్రకటించారు. పోలింగ్ ముగిసిన వెంటనే వాహనాల్లో బ్యాలెట్ బాక్స్‌లను గుంటూరు పంపారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎస్ఐ వెంకటరవి, తదితరులు కేంద్రం వద్దే ఉండి ఓటింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు.

70.18 శాతం పోలింగ్ నమోదు

మేడికొండూరు: మండలం కేంద్రంలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 203, 204 పోలింగ్ బూత్‌లలలో 1,741 ఓట్లుకు గాను, 1,222 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 70.18 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ మేడికొండూరు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పోలింగ్ బూత్‌ల్లో జేసీ పరిశీలన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలోని 205, 206, 206ఏ పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 69 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. మండలపరిధిలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 2,074 మంది ఉండగా 1,431 ఓట్లు పోల్ అయినట్లు చెప్పారు. బూత్ సమీపంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసామని, ఓటర్ స్లిప్‌లు లేనివారికి బీఎల్వోలు అందజేసినట్లు వివరించారు. పోలింగ్ బూత్‌లను జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్ పరిశీలించారు. బూత్‌లో తిరిగి సౌకర్యాలు పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.



ఓటుహక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు



మేడికొండూరు: పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ భార్గవ్ తేజ

మంగళగిరి నియోజకవర్గంలో 72 శాతం పోలింగ్

మంగళగిరి టౌన్ : కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో 72 శాతం పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్న ఎన్నికల అధికారులు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలో 69 శాతం, రూరల్ పరిధిలో 70 శాతం, తాడేపల్లి మండల పరిధిలో 74 శాతం, దుగ్గిరాల మండల పరిధిలో 74 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ఉదయం 8 గంటలకు మొదలవగా సాయంత్రం 4 గంటలకు కూడా క్యూ లైన్‌లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. బ్యాలెట్ పేపర్లను గుంటూరు ఏసీ కాలేజి స్ట్రాంగ్ రూమ్‌కు భారీ బందోబస్తు నడుమ తరలించారు. రెండుమూడు చోట్ల స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 25 మంది అభ్యర్థులు ఉండగా కేఎస్ లక్ష్మణరావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ మధ్య పోటీ నెలకొంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగనుంది. మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్ కె. నగేష్‌బాబు మంగళగిరి సీకే హైస్కూల్‌లో తను ఓటును వినియోగించుకున్నారు.



ఓటు వేసేందుకు క్యూలో పట్టభద్రులు



మేడికొండూరు: ఓటు వేసేందుకు వీల్ చైర్‌లో వస్తున్న దివ్యాంగురాలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

తాడికొండలో టీడీపీ నాయకుల అత్యుత్సాహం



ఓటు వేసేందుకు వచ్చిన దివ్యాంగురాలు



తాడికొండలో పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తున్న టీడీపీ నాయకులు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న మహిళ

తాడికొండ: తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బెదిరింపులు, దూకుడు చర్యలతో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు నానా తంటాలు పడ్డారు. పోలింగ్ కేంద్రంలో వచ్చిన ప్రతి ఓటరును తమవద్దకు పిలుచుకొని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఓటు వేయాలంటూ చెప్పారు. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్షణ రావు పోలింగ్ ఏజెంట్‌లను బెదిరించేందుకు ప్రయత్నించారు. గుర్తింపు కార్డులు లేకుండా ఓట్లు ఎలా వేయనిస్తారంటూ ప్రశ్నించిన ఉద్యోగులపై కన్నెర్ర జేయడంతో కిమ్మనకుండా కూర్చున్నారు. ఒకానొక దశలో టీడీపీ నాయకుల హవా పెరగడంతో పోలింగ్ బూత్ వద్ద ఏజెంట్లు అభ్యంతరం మేరకు బయటకు వెళ్లాలని ఆదేశించినా వినకుండా పోలీసులపైనే తిరగబడ్డారు. పట్టభద్రులమైన తమపైన ఈ తరహా వ్యవహార శైలి ఉంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ఓటర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తాడికొండ మండలంలో 2,232 మంది ఓటర్లకు గాను 1,536 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 68.8 శాతంగా ఓటింగ్ నమోదైంది. తుళ్లూరు మండలంలో 2,667 మంది ఓటర్లకు గాను 2,106 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 79.11 శాతం ఓటింగ్ నమోదైంది.

ముమ్మరంగా శనగ, జొన్న కోతలు

ఇతర గ్రామాల కూలీలకు ఉపాధి



యంత్రం సాయంతో శనగ కల్లం చేస్తున్న కూలీలు

తాడికొండ: వ్యవసాయ పనులు తుది దశకు చేరాయి. మండలంలో శనగ, జొన్న పంట కోతలు జోరుగా కొనసాగుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఈ ఏడాది త్వరగా కోతకు రావడంతో.. రైతులు పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. రాజధాని ప్రాంతం పూలింగ్ గ్రామాలతో పాటు ఈమని, వల్లభాపురం, గుంటూరు రూరల్ మండలాల నుంచి భారీగా వలస కూలీలు పనుల కోసం వస్తుండటంతో నిండుగా ఉపాధి లభిస్తోంది. ఎకరా శనగ కోతకు రూ.3వేలు, యంత్రం సాయంతో కల్లం చేసేందుకు రూ.4 వేలు కూలి ఇస్తుండటంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జొన్న పంట బాండ్‌పై రైతులు సాగు చేస్తుండగా.. ఈ ఏడాది దిగుబడి పెరగడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనగ పంటకు మాత్రం సరైన మద్దతు ధర లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలను క్వింటా రూ.7,300 వరకు కొనుగోలు చేసిన రైతులు...పంట విక్రయించబోతే.. క్వింటా రూ.5,500 మాత్రమే కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి శనగ కొనుగోలు కేంద్రాలను తెరిచి, మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



శనగ కోతలో కూలీలు

కష్టించి పనిచేస్తే సముచిత స్థానం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



పానుగుపాడు ఎస్సీ కాలనీలో మాట్లాడుతున్న సమన్వయకర్త బాల వజ్రబాబు

ఫిరంగిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టించి పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని పానుగుపాడు, గుండాలపాడు గ్రామాల్లో గురువారం సాయంత్రం నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గ్రామంలో పేదలకు ప్రభుత్వం పథకాలు అందేవన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. అనంతరం గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. సమష్టిగా అందరూ కలసికట్టుగా ముందుకు సాగుదాం అంటూ వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా, చిట్టా అంజిరెడ్డి, కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, గేరా కోటేశ్వరరావు, మేలం జోజిబాబు, సర్పంచ్ పి.మధుసూధనరావు, పెరికల చిన్నా, చేవూరి రామమోహన్‌రెడ్డి, ఎస్.నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, రాజేష్, బాజీ బాబు, కృష్ణమోహన్, సాగర్, దాసులు పాల్గొన్నారు.